షష్టిపూర్తి

కప్పగంతుల మల్లికార్జునరావు

రంగురంగుల దీప తోరణాలు....బ్యాండు మేళాలు.... రకరకాల చీరెలు.... ఎటు చూచినా కోలాహలం.

అలంకరింపబడ్డ కళ్యాణమండపం... మండప మధ్యంలో మేనేజింగ్ డైరెక్టర్ బిశ్వాస్ ఛటర్జీ, ఆయన ధర్మపత్ని.... పార్వతీపరమేశ్వరుల్లావున్న ఆ వృద్ధ దంపతుల చుట్టూ కొడుకులు, కూతుళ్లు, మనుమలు, మనవరాళ్లు, మునిమనములు.. ఛటర్జీగారి మొహంలో మెరిసిపోతున్న తృప్తి, గర్వం....

ఛటర్జీగారి సహస్ర మాసచంద్ర ధర్మనోత్సవాన్ని శ్రద్ధగా తిలకిస్తున్నాడు ఐ.పి.రావు. అలా చూస్తుండగా రావుకు హఠాత్తుగా తన జీవితంలో ఏదో వెలితి వున్నట్లనిపించి వులిక్కిపడ్డాడు.

అప్పుడెప్పుడో యువకుడిగా వున్నప్పుడు దారిద్ర్యంవల్ల, నిరుద్యోగ బాధవల్ల యిటువంటి అనుభూతి పొందినట్లు గుర్తుకొచ్చిందతనికి.

కానీ కొన్ని దశాబ్దాలుగా ఆ పాపిష్టి గతాన్ని గురించి మర్చిపోయాడు. ఛటర్జీగారి కంపెనీలో చిన్న వుద్యోగిగా అడుగుపెట్టి పెద్దపెద్ద ప్రణాళికలు వేసి కంపెనీని అభివృద్ధిచేసి తను అభివృద్ధి చెందేడు. యిప్పుడు అతడిని చూసి కంపెనీ వుద్యోగులు గర్విస్తారు. ఛటర్జీగారికయితే అతనంటే వల్లమాలిన అభిమానం, విశ్వాసం, గర్వం. రావుగారే తన ప్రజ్ఞను తల్చుకొని గర్వించిన క్షణాలు కూడా లేకపోలేదు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అతనికి ముందుచూపు తప్ప వెనకచూపు లేనేలేదు. అతనికి పని దేముడు. డబ్బుకు, అధికారానికి, పలుకుబడికి, ఆరోగ్యానికి దేనికీ లోటులేదతనికి.

మరి యీ వెలితి ఫీలింగ్ ఎందుకు కలిగినట్లు?

ఎందుకంటే తనకి ఇరవై సంవత్సరాలని అతనికప్పుడు గుర్తుకొచ్చింది. తనూ షష్టిపూర్తి చేసుకోవాలన్న కోరిక కలిగింది.

అప్పుడు అతనికి అసలు విషయం గుర్తుకొచ్చింది. అదే అతని జీవితంలో వున్న వెలితి.

ఐ.పి. రావు యింతవరకు వొంటరి. అసలు అతను పెళ్లిని గురించే కాదు, స్త్రీలను గురించైనా యింతవరకు ఆలోచిస్తేనా?

* * * *

కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పోస్టునుంచే కాక అసలు కంపెనీ వ్యవహారాల నుంచే రిటైరవుతున్నానన్న రావు ప్రకటన ఛటర్జీని కలవరపెట్టింది. రావ్ లేని కంపెనీ భవిష్యత్తు ఊహించాలంటే భయంవేసింది.

'మిష్టర్ రావ్. నా వల్ల ఏదన్నా పొరపాటు జరిగిందా?'

'లేదు సార్. యు ఆర్ ఆల్‌వేస్ మై ఎల్డర్ బ్రదర్....'

'మరి కంపెనీ వ్యవహారాలనుంచి ఎందుకు తప్పుకోవాలనుకొంటున్నావు? నిజానికి నా తర్వాత యీ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్ మీరేనని ఎన్నోసార్లు చెప్పేను కదా?'

'లేదు సార్. నే ఇంక కంపెనీ బాధ్యతల్ని స్వీకరించలేను. నా మనసు మరెటో మళ్లింది. నేను బ్రహ్మచారినని మీకు తెల్సు. యిప్పుడు వివాహం చేసుకొని జీవితంలో సెటిల్ అవాలనుకొంటున్నాను.'

'వివాహమా? యిప్పుడా?'

ఛటర్జీ, రావువద్ద ఎన్నోసార్లు వివాహప్రసక్తి తెచ్చేడు. కానీ అతను వినిపించుకొంటేనా? అలాంటి రావ్ యిప్పుడు తనకుగా తాను వివాహం చేసుకొంటానంటున్నాడు. అరవయ్యోఏట!

'అలా చెప్పండి. మీ నిర్ణయం మాకు మాత్రం సంతోషం కాదనుకొన్నారా? ఆ పెళ్లి మేము చేస్తాము. పురుషుడు పెళ్లి చేసుకొంటానంటే స్త్రీలకే కొదవా? అందునా మీలాంటి వ్యక్తికి! అందుకు కంపెనీ వదలి వెళ్లటం ఎందుకు?'

'నా మేరేజ్ మీరు చేసేదికాదు సార్. యింతవరకు స్త్రీలను గురించి, వివాహాన్ని గురించి ఆలోచించనైనా ఆలోచించని వాడిని నేను. యిప్పుడు నా భార్యను నేను వెతుక్కోవాలి. నా 'లైఫ్‌ని' నేను అన్వేషించుకోవాలి. నా కోరికను కాదన కండి ప్లీజ్....'

* * *

కంపెనీ స్టాఫ్ బ్రహ్మాండంగా వీడ్కోలిచ్చిందతనికి. అతను కంపెనీలో ప్రతి వొక్కరినీ కలిసి పరామర్శలుచేసి వీడ్కోలు చెప్పేడు.

ఆ ప్రాసెస్‌లో అతను స్త్రీ వుద్యోగులను– అందునా పెళ్లి కాని స్త్రీలను, చాలా పరిశీలనగా చూచాడు. అతని చూపుల్లో భేదాన్ని స్త్రీలు కూడా గుర్తించారు. అంతకు ముందు అతడిని తమ సౌందర్యంతో ఆకర్షిద్దామని ఎందరో స్త్రీలు ప్రయత్నించారు. తమ అందాన్ని గుర్తించకపోగా, తమని యంత్రాలలో వొకదానిగా ఆతను చూడటం గుర్తు కొచ్చింది కొందరికి. ఆశ పుట్టింది. బ్రహ్మచారి– తమని పెళ్లిచేసుకొంటే ఎంత బాగుండును!

అరవై ఏళ్ళొచ్చిన రావ్ ఆరోగ్యంతో మెరిసిపోతుంటాడు. పసిమి పచ్చటి ఛాయ.... కొనతేరిన ముక్కు.... చురుగ్గా వుండే కళ్లు.... అంత మరీ పొడుగూ పొట్టీకాని శరీరం....అందగాడే అతను అక్కడక్కడా నెరసిన జుట్టు అతని అందానికి హుందాను చేకూర్చింది. ఫుల్‌సూట్‌లో ఎప్పుడూ ఠీవిగా వుండే అతడిని చూస్తుంటే స్త్రీలకు అతని వయసు గుర్తురాదు అసలు.

పెళ్లి చేసుకొంటా నంటాడేమోనని ఆశపడ్డ అమ్మాయిలకు నిరాశే మిగిలింది. రావ్ కలకత్తా నుంచి ఢిల్లీలో ఏదో పని వుంటే విమానంలో బయలుదేరేడు. విమానాశ్రయంలో ఎదురైన స్త్రీలనల్లా పరిశీలనగా చూచాడు. ఎప్పుడూ మాట్లాడని ఎయిర్‌హోస్టెస్‌తో ఏమోమో మాట్లాడేడు. ఏం లాభం?

ఢిల్లీలో పని చూచుకొని రైల్లో హైదరాబాద్‌కు ప్రయాణమయ్యాడు.

* * *

ముందుగా రిజర్వ్ అయిన ఎయిర్ కండిషన్ కంపార్టుమెంటులో కిటికీవద్ద కూర్చొని ప్లాట్‌ఫామ్ మీదనున్న స్త్రీలను చూస్తున్నాడతను

ఖరీదైన తెల్లటి పంచె.... తెల్లటి లాల్చీ.... టినోపాల్ మనిషిలా ప్రకాశిస్తున్నాడతను.

అతని చూపులచురుక్కి ఆగి కొందరు స్త్రీలు అతడిని పరీక్షగా చూచారు. కానీ

అతడు మొహం తిప్పుకోవటంతో తమ తోవన తాము వెళ్ళిపోతున్నారు.

రావ్‌కు కావల్సింది అలాంటి స్త్రీలు కాదు. అతనికి భార్య కావాలి. ధర్మపత్ని, సహధర్మచారిణి....

పెళ్లి చేసుకోవాలన్న కోరిక అతనికి కలగటానికి ప్రేరణ కామం కాదు. కామమే కారణమవుతే అతను దాన్ని అనేక పద్ధతుల్లో నిగ్రహించుకోగలడు. కానీ వివాహంయొక్క పరమార్థం కేవలం కామవాంఛా తృప్తి మాత్రమే కాదని అతనికి తెల్సు. అంతకన్నా మించిందేదో వుంది.

'పిన్నీ.... హైదరాబాద్‌కు వెళ్లగానే మెసేజ్ యివ్వు....'

'అమ్మమ్మా....టాటా....గుడ్ బై...'

ఉలిక్కిపడి కంపార్టుమెంటులోకి చూచాడు రావు. ఎదుటి బెర్త్‌మీద వో స్త్రీ కూర్చొని వుంది. ఆమె తాలూకు సామానులన్నీ సర్దుతున్నాడో యువకుడు. అతని భార్య కాబోలు. ఆమెకు ఏమేమో చెప్తోంది.

ఆమె పాపను వొళ్లోకి తీసుకొని ముద్దుపెట్టుకొంది.

ట్రయిన్ కదలబోతున్నట్లు అనౌన్సుమెంటు విన్పించింది.

'ఊ.... సుజీ.... మనం దిగుదాం. ట్రయిన్ కదలబోతోంది.' వాళ్లముగ్గురూ ప్లాట్‌ఫామ్ మీదికొచ్చారు. కిటికీలోనుంచి అతని భార్య ఆమెకు జాగ్రత్తలు చెప్తోంది.

'పిన్నీ. వంటరిగా ప్రయాణం. జాగ్రత్త! బుట్టలో నీకు అవసరమైన వస్తువులనన్నిటినీ పెట్టేను.'

యింజన్ గర్జన. ఆ తర్వాత 'టాటాలు.... బైబై'ల కోలాహలం. ట్రయిన్ నెమ్మదిగా న్యూఢిల్లీ స్టేషన్‌ను కదిలింది.

* * *

ఆమె తనవైపు చూస్తుందేమో ఎలాగోలాగు ధైర్యంచేసి పలకరించి పరిచయం చేసుకొందామని ఆశపడ్డాడు రావు. కానీ ట్రయిన్ ప్లాట్‌ఫామ్ దాటక ముందే ఆమె ఏదో పుస్తకం తీసింది. అంతే. అందులోంచి దృష్టిని యివతలకి మరలిస్తేనా!

అసలింతకీ ఆ గ్రంథం ఏమిటో?

పుస్తకం బైండ్‌చేసి వుండటంవల్ల టైటిల్ పేజీ కన్పించటం లేదు.

భారతమా? భాగవతమా? ఆ గ్రంథాలని అంత దీక్షగా, ఉత్కంఠతో చదువుతారా? ఛేజ్, హెరాల్డ్ రాబిన్స్, ఆర్థర్ హైలీ, ఇర్వింగ్ వేలెస్....

పుస్తకం ఏమిటా అని ఆలోచిస్తూ ఆమెనే చూస్తూ కూర్చున్నాడు.

నలభై ఏళ్ళకు పైగానే వుంటాయి ఆమెకు. లేత తమలపాకు ఛాయలో వుంది. తెల్లటి రంగుమీద ఎర్రటి బార్డరున్న నాజూకైన పట్టుచీరె కట్టింది. మెడలో బంగారు గొలుసు. చెవులకి కమ్మలు.

తెల్లగా అక్కడక్కడా తళుక్కుమంటున్న జుట్టును హుందాగా ముడి వేసింది. మొహంమీద పావలా కాసంత ఎర్రటి కుంకుమబొట్టు. కాళ్లకు పసుపు.

చూచేకొద్దీ ఆమెను చూడాలని బుద్ధి పుట్టిం దతనికి.

'ఛీ. ఆమె ఎవరో గృహిణి. పెద్ద ముత్తయిదువ. ఆమె నిలా చూడటం ఎంత తప్పు? ఆమె తను చూస్తున్నట్టు గమనిస్తే ఏమనుకొంటుంది? తెల్ల డ్రస్‌లో నల్ల మనిషి అనుకోదూ? ఎయిర్ కండిషన్ కంపార్టుమెంట్‌లో ప్రయాణం చేసే ఘరానా రౌడీ అనుకోదూ? అమ్మో. ఆమె తనని గురించి అలా అనుకోటం తాను భరించలేడు.'

అతను ఆమెనుంచి దృష్టిని మరల్చాలని విశ్వప్రయత్నం చేసేడు కృతకృత్యుడయ్యాడు కూడా. కానీ ఆ నిశ్చలత ఎంతసేపు? మనసు ఆమెవైపే లాగుతోంది. కళ్లను లాక్కుపోతోంది అటు.

ఆమెకు పెళ్లయిందా? యింకా కాకుండా వుంటుందా? పిల్లలెంతమందో? ఢిల్లీ స్టేషన్లో పాప "అమ్మమ్మా" అంది. పాప అమ్మ "పిన్నీ" అంది. అంటే ఆ యువతి స్వంత కూతురు కాదు. పిల్లలు, భర్త వుండి ఢిల్లీకి వొంటరిగా ఎందుకొచ్చిందో?

ఒకవేళ ఆమెకి పెళ్లికాలేదేమో?

ఆ భావన రావుకు ఎందుకో ఆనందాన్ని కలిగించింది.

చూడటానికి అచ్చం తెలుగు గృహిణిలా వుంది. చదువుకొన్నదా? ఉద్యోగం చేస్తున్నదా? వొక్కసారి ఆమె కన్నెత్తి తనని చూస్తే ఎంత బాగుండును?

అయినా ప్రయాణంలో మనిషితోడుతో సమానం పుస్తక పఠనం.

తనను చూస్తే, తనతో చొరవగా మాట్లాడితే, తను ఏమైనా చేస్తానని భయమా? అయినా తనేమైనా చెయ్యదల్చుకొంటే మాట్లాడకుంటే మాత్రం చేయకూడదూ? రాత్రంతా మేమిద్దరే వొంటరిగా ప్రయాణం చేస్తారు. ఆమెకు చీమకుట్టినట్లు లేదేం?

'మీరు నన్నేమనుకొంటున్నారో? కాని నేను దుర్మార్గుడిని కాను....' మిస్ అనాలా, మిసెస్ అనాలా? అసలు ఆమె పేరేమిటో? యింత అందంగా, హుందాగా వున్న ఆమె పేరులో కూడా విశిష్టత వుండే వుంటుంది.

ఆమె దృష్టిని ఆకర్షించే ప్రయత్నంగా అతను రెండుసార్లు లేచి కూపే బయటికి వెళ్ళి వచ్చాడు. పొడిదగ్గులు దగ్గేడు. కానీ తనే పలకరిస్తే?

ఒంటరిగా ఎంతసేపీ ఆరాటం? మరో మనిషన్నా లేడు. అయినా యివాళ బెర్త్‌లు ఖాళీగా వున్నాయేం?

అతను ధైర్యం చేసేడు.

'క్షమించండి....' అతని మనసు వణికింది. నాలిక తడబడింది.

'మీరు హైదరాబాద్ కేనా?'

ఆమె పుస్తకంలో నుంచి దృష్టిని మరల్చింది. అతనివైపు క్షణంలో సగం సేపు చూచి 'ఊ' అంటూ మళ్లీ పుస్తకం లోకి తలదూర్చింది.

ఆ వొక్క 'ఊ' అతనికి వెయ్యి విధాలుగా విన్పించింది. మరో ప్రశ్న అడగటానికి సాహసించలేకపోయాడు. అయినా ఆగి ఆగి ఎంత చచ్చుప్రశ్న అడిగాడు తను? కనీసం పేరన్నా అడిగేడు కాడు? సమభావం తెల్పిన ప్రశ్న నే అడగటం ఎంత ఫూలిష్‌నెస్....

బిజినెస్ వ్యవహారాల్లో ఎంతో నైపుణ్యంగా మాట్లాడుతాడని పెద్ద పేరు తనకి. ఏమయిందా నైపుణ్యమంతా యిప్పుడు?

'ఎక్స్‌క్యూజ్ మి సర్' అంటూ అటెండర్ వచ్చి డ్యూప్లీ స్టేషన్ త్వరలో రాబోతున్నదని చెప్పి, మీల్స్‌కు ఆర్డరి స్తారా అని అడిగాడు.

'ఊ. స్పెషల్ సౌత్ ఇండియన్ మీల్స్ టు' చొరవచేసుకొని చటుక్కున అన్నాడు రావ్.

'వద్దు ప్లీజ్! భోజనం [illegible] మా సుజీ చేసింది. యూ కెన్ ప్లీజ్ గో' అంటూ అటెండర్‌ని పంపించేసింది.

ఆమె పుస్తకం మూసేస్తూ చేతి గడియారం చూచుకొంది.

'మా సుజీకి అన్నీ ఎక్కువగా పెట్టటం అలవాటు. మీరు నా ఆతిథ్యాన్ని స్వీకరించరూ? ప్లీజ్....' అంటూ ఆమె ఆ ఏర్పాట్లలో మునిగిపోయింది.

యిదే మంచి సమయం. ఆమె పేరు యిత్యాది వివరాలు అడిగేకన్నా పుస్తకం అడిగి తీసుకొని చూస్తే ఆమె విషయాలు చాలా తేలవచ్చు.

'ప్లీజ్....ఆ పుస్తకం యిస్తారా?'

ఆమె పుస్తకాన్ని అతని చేతికిచ్చింది.

అతను ఆత్రంగా పుస్తకాన్ని తెర్చి చూచాడు.

అది నవల కాదు. భారతభాగవతాలూ కాదు.

ఇజాక్ అసిమోవ్ 'లైఫ్ అండ్ టైమ్' యిత్యాది పుస్తకాలన్నీ కలిపి బైండ్‌చేసిన సంపుటి! 'సెన్స్ - మైండ్ .... అండ్ రెలిజియన్! ...'

ఆమె పేరుకోసం పుస్తకం అంతా తిరగేసేడు. ఊహూ.... ఎక్కడా లేదు.

'నా పేరు అహల్య. మిస్ అహల్య' అందామె పులిహోర యిత్యాది పదార్థా లున్న వో ప్లేట్‌ను అతని ముందు వుంచుతూ.

* * *

యింకొక్క అరగంటలో సికిందరాబాద్ స్టేషన్! ఆ తర్వాత ఆమె దోవ ఆమెది నా దోవ నాది.

ఆ భావన అతనికి బాధగా వుంది. భరించలేకపోయాడు.

మరికొంతసేపు ప్రయాణం చేస్తే ఎంతబాగుండును? పోనీ రైలు ఏదో

కారణంగా యిక్కడ ఆగిపోతే ఎంత హాయిగా వుంటుంది?

అన్ని గంటలసేపు ప్రయాణం చేసికూడా ఆమెను గురించి తెల్సుకొన్న వివరాలకన్నా తెల్సుకోవాల్సిన వివరాలే ఎక్కువగా వున్నాయి. తనని గురించి ఆమెకు ఏమీ చెప్పలేదు. తన కోరికను సూచన మాత్రంగానైనా....

'ఏమండీ....' అతను తెగించాడు. ధైర్యం తెచ్చుకున్నాడు.

కానీ ఆమె తనవైపు చూడగానే అడగదల్చుకొన్న విషయాలు మర్చిపోయాడు. మనసు తడబడింది.

'మీరు... మీరు పెళ్ళెందుకు చేసుకోలేదు?'

ఆమె జవాబివ్వలేదు. మెల్లగా నవ్వి పుస్తకంలో తలదూర్చింది.

నిస్పృహతో నిట్టూర్చాడు రావ్. ఆఖరి ఛాన్సు. పిచ్చిప్రశ్న అడిగి చేజేతులా చెడగొట్టుకున్నాడు. ఆ ప్రశ్న అడిగేక యిక ఏ మొహంపెట్టుకొని ఆమెతో మాట్లాడటం?

సికిందరాబాద్ స్టేషన్‌లో బండి ఆగింది. ఆమె పోర్టరును పిలిచింది.

రావ్‌ను రిసీవ్‌చేసుకోటానికి ఛటర్జీ కంపెనీ తాలూకు అధికారులు, మందీ మార్బలాలతో స్టేషన్ కొచ్చేరు. ఛటర్జీ సికిందరాబాద్‌లో వో పెద్ద బంగళాని, వో కారుని అతనికి ఫ్రీ మేరేజ్ ప్రెజెంట్‌గా వద్దనేకొద్దీ యిచ్చాడు.

'అదుగో మిస్టర్ రావ్....' అంటూ అధికారులు పూలగుచ్ఛాలతో కంపార్ట్‌మెంట్‌లోకి జొరబడ్డారు.

రావ్- ఆమె!

'హార్టీ కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ రావ్. వెల్‌కమ్ టు ది న్యూలీ మేరీడ్ కపుల్....' అందులో వో ఆఫీసర్ రావ్‌తోపాటు ఆమెకూ పుష్పగుచ్ఛాన్ని ఆఫర్‌చేస్తూ అన్నాడు.

రావ్ ఆమెవైపు చూచాడు అపరాధ భావనతో. ఆమె అతనివైపు చురుగ్గా చూచింది.

'సారీ....' అన్నాడతను.

'దట్సాల్‌రైట్. నేనుండేది అశోక్ నగర్‌లో. నా ఫోన్ నెంబరు....'

వెళ్ళబోతున్న ఆమెను పిల్చి తన వివరాలున్న కార్డు యిచ్చాడు రావ్.

* * *

'రాంగ్ నెంబర్ ప్లీజ్... '

ఆమె యిచ్చిన ఫోన్ నెంబర్ రాంగ్ నెంబర్. ఆ ఫోన్ నెంబర్‌ను బట్టి ఆ చిరునామా తెల్సుకొన్నాడు. ఆ ఫోన్ వున్నది అశోక్‌నగర్ కాదు. విజయనగర్ కాలనీ.

ఆమె తనని ఎందుకిలా మోసం చేసింది? లేక ఆటలు పట్టించిందా? కొత్త జీవితంకోసం అన్వేషణ అరంభంలోనే యిలా అయిందేం?

అతను ఆమెని మర్చిపోవాలనుకొన్నాడు. కొత్తగా అన్వేషణ సాగిద్దామనుకొన్నాడు. ఊహూ.... సాధ్యం

కాలేదు. ఆ వయసులో అర్థంతెలియని యీ అనుబంధం ఏమిటి?

అలా ఆరాటపడ్తుండగా ఆమెనుంచి వుత్తరం. అతనికి ప్రాణం లేచివచ్చి నట్లయింది.

'రావ్‌గారూ

బాధపడ్తున్నారా? మోసంచేసేనని తిట్టుకుంటున్నారా?

ఫోన్‌చేసి మీరు నాకు కొత్తగా చెప్పేదేముందండీ? మిమ్మల్ని పుస్తకం కన్నా స్పష్టంగా చదివి అర్థంచేసుకొన్నాను. నన్ను మీరు మొదటి చూపులోనే ప్రేమించారు పెళ్ళిచేసుకొందామనుకొంటున్నారు. అంతే గదా?

ఏదో అడగబోయి నన్ను పెళ్ళెందుకు చేసుకోలేదని అడిగేరు. కదూ? నిజం చెప్తాను. కోపగించుకోకండి.

నాకు చాలా చిన్నతనంలో ఎప్పుడో పెళ్ళయిందండీ దారిద్ర్యపు బాధను, నిరుద్యోగ సమస్యను తట్టుకోలేక నా భర్త పిరికివాడులా పారిపోయా డెక్కడికో. నా భర్త మొహంకూడా నాకు తెలియదు. అయినా ఆయన నా మెళ్ళో కట్టిన మంగళసూత్రానికి విలువనిచ్చి

వివాహ వ్యవస్థపైన గౌరవంతో ఆయన తిరిగి వస్తాడని కొన్నాళ్ళు ఎదురు చూచాను. చుట్టూ వున్న సమాజ సభ్యులు నన్ననేక విధాల వేధించారు.

నాకు రోషం వచ్చింది. ఆయన్ని మనసులో చంపేసాను. నా గతాన్ని చంపేసేను నేను రాయిగా మారి కుమారి అహల్య నయ్యాను. పట్టుదలతో చదివేను.'

'నిజంగానే నీ భర్త చనిపోయాడు అహల్యా నువ్వు మంచిపని చేసేవు' రావ్ వుత్తరం మధ్యలో ఆపి కళ్ళు తుడుచుకొంటూ గొణుక్కొన్నాడు.

'నా చదువుకు తగ్గ వృత్తిని చేపట్టి బోలెడంత సంపాదించాను. నా సోదరీ సోదరులను చదివించాను. పెళ్ళిళ్ళు చేసేను వృత్తిధర్మంగా ఎందరి మనసులకో స్వస్థత చేకూర్చాను.

కానీ నా మనసుకు తృప్తి లేదేం? ఏదో వెలితి. ఒంటరి భావన.

అప్పుడప్పుడూ పెళ్ళిచేసుకొందాం అన్న కోరిక కలగకపోలేదు. కానీ ఒక సమస్యా పరిష్కారంలోనుంచి మరో సమస్య వుత్పన్నం కాకూడదు గదా?

విధవలు పెళ్ళిచేసుకొంటున్నారు. విడాకులు పుచ్చుకున్న స్త్రీలు పెళ్ళిచేసుకొంటే సమాజం, న్యాయశాస్త్రం కూడా అంగీకరిస్తాయి. కాని భర్త వదిలేసి వెళ్ళిన స్త్రీలు, భర్త జాడ తెలియని స్త్రీలు ఎన్నాళ్ళన్నా పసుపుకుంకుమలతో పునిస్త్రీలుగా వుండవచ్చు కాని తిరిగి పెళ్ళిచేసుకోకూడదు. యీ సమాజ సూత్రాన్ని నేను ఎదిరించదల్చుకొంటే ఎదిరించవచ్చు. కానీ నా వివాహం నాకు కాని నన్ను చేసుకొన్న వారికి కాని సమస్య కారాదు కదా?

రావుగారూ,

జీవిత భాగస్వాముల్లో వొకళ్ళు మాత్రమే వైవాహికబంధ పవిత్రతకు విలువనిస్తే సరిపోతుందా? రెండుచేతులూ కలిస్తే కాని చప్పట్లు మోగటమే కాదు సమస్కారం కూడా కాదు.

మీరు వైవాహిక బంధాన్ని, కుటుంబ వ్యవస్థని గౌరవించేవారుగా నేను అర్థం చేసుకొన్నాను. మీ వివాహ వాంఛ, ప్రేమాతిశయం, కామవాంఛతో కూడినవి కావని కూడా గ్రహించాను. అందుకే మీకు యిదివరకే పెళ్ళయిందా, ఎందుకు పెళ్ళిచేసుకోలేదు, భార్య చనిపోతే రెండో పెళ్ళి చేసుకోవాలనుకొంటున్నారా అన్న మీ గతానికి సంబంధించిన ప్రశ్నలను నేను వేసుకోవటంలేదు. మీరు నన్ను కోరటానికి సందేహించిన కోరికను నేను కోరుతున్నాను.

నేను మిమ్మల్ని జీవితభాగస్వామిగా పొందాలనుకొంటున్నాను. మీకు అభ్యంతరం లేదుగా?

నా కథంతా తెల్సుకొన్నాక కూడా మీ నిర్ణయం మారకపోతే మీరు నాకు ఫోన్ చేయవచ్చు. యీసారి నేనిస్తున్నది

రాంగ్‌నెంబర్ కాదు. కానీ ఆ నెంబరుకు డయిల్‌చేసేముందు వొకటికి పదిసార్లు ఆలోచించండి. రైట్ నెంబర్ అనుకొని తొందరపడి రాంగ్‌నెంబర్‌కు డయిల్ చేయటంవల్లే చాలామంది వైవాహిక జీవితాలు పనిచేయని టెలిఫోన్లు అవుతున్నాయి.'

ఉత్తరం ఎలా చదివేడో! శరీరమంతా నీరసం మనసంతా దోషభావనా జ్వాలల్లో దహించుకుపోతుంది. ... తనకున్న వుత్సాహం, ఆరాటం చచ్చిపోయాయి. వేదన [illegible]

ఎప్పుడో మరచిపోయిన పాపిష్ఠి గతం కళ్లముందు నిలిచింది.

తన చదువు.... పెళ్ళి....జీవన వైఫల్యాలు....బాధలు....వైరాగ్యం. . పెళ్ళి మీదేకాక జీవితం మీదే విరక్తి....

ఆ భార్య పేరు అహల్య కాదు. అనూరాధ....

ఇన్నేళ్ళ యాంత్రికజీవితం తర్వాత వైవాహిక జీవితంలో గల మాధుర్యం గుర్తువొచ్చింది తనకు. ఏ యంత్రానికి ఎలాంటి స్పేర్ పార్ట్ అవసరమో ఠక్కున చెప్పగలిగిన శక్తివున్న తనకు తనకీ స్థితిలో ఎలాంటి భార్య అవసరమో కూడా ఆరోయింద్రియం చెప్పింది. తన జడ్జ్‌మెంట్ రైట్.

కానీ అనూరాధ? తనొక్కప్పుడు తృణీకరించిపోయిన వైవాహిక బంధం పట్ల గౌరవంతో జీవితంలో వొంటరిగా పోరాడింది తను పైకొచ్చి యితరుల్ని పైకితెచ్చింది యంత్రం కాలేదు- తన లాగా పవిత్రతనూ కోల్పోలేదు. యిన్నాళ్ళకు ఆమె తనవల్లే ప్రేరణ పొంది కొత్త జీవిత భాగస్వామిని పొందాలనుకోటం ఎంత వింత! ఆ కొత్త భాగస్వామి పాతవాడేనని ఆమెకి ఏనాటికైనా తెలిస్తే?

'అనూరాధగా నన్ను క్షమించావ్ వొకసారి. మరోసారి కూడా క్షమించు అహల్యగా కూడా. నేను నీకు ఏ మాత్రం తగనివాడిని '

అతను వుత్తరం చించబోతూ ఆగేడు.

'వొకనాడు తాళికట్టి నా దారి పోయి వంచించాను యీనాడు తోడుగా వుంటా నన్న ఆశ కల్పించి, తీరా ఆమె తోడును అర్థించాక పారిపోయి మరోసారి వంచించటమా? నో! నా గతం ఆమె తనకు అక్కర్లేదంది. కానీ ఆమెకు అక్కర్లేని గతమే నాకు గుణపాఠం. భవిష్యత్తును సక్రమమార్గంలో నడిపే బాట.'

అతను ఉత్తరాన్ని పదిసార్లు చదివేడు బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌గా కాదు. కాబోయే భర్తగా, మనిషిగా బాగా ఆలోచించి వో నిర్ణయానికొచ్చాడు.

'యింతకీ అహల్య వృత్తి ఏమిటో?' అనుకున్నాడు, ఆమె యిచ్చిన నెంబర్‌కి డయిల్ చేస్తూ.

'యస్ కన్‌సల్టెంట్ సైకియాట్రిస్ట్ డాక్టర్ అహల్య....'

ఇంగువ ప్రభాకరరావు నూతన భవిషత్ జీవితం ఆశాజనకంగా కన్పించింది. ఉత్సాహం వచ్చింది.

షష్ఠిపూర్తి వుత్సవం అతని కళ్ళ ముందు వైభవోపేతంగా దర్శనమిచ్చింది.

— —